
పద్మా రామచంద్రమూర్తి



# వ్యక్తిత్వం

హడావుడిగా రొప్పుతూ ఆఫీసులో అడుగుపెట్టింది వైష్ణవి. టైమ్ చూసుకుంది. పదిన్నర. ఠంచనుగా పది గంటలకి రిజిష్టర్‌లో సంతకం చేయకపోతే పంక్చువాలిటీ గురించి అరగంట క్లాస్ తీస్తాడు బాస్. ఆఫీసులో వాతావరణం మాత్రం ఊహించిన దానికి భిన్నంగా ఉంది. సాధారణంగా ఎవరి సీట్లలో వాళ్ళు కూర్చుని సీరియస్‌గా పనిలో నిమగ్నమై ఉండేవాళ్ళంతా సైనో గాయత్రి సీటు దగ్గర చేరి గుసగుసలాడుకుంటున్నారు.

రిజిస్టర్‌లో సంతకం చేసి తన సీట్లోకొచ్చి కూర్చుంది. మొత్తానికి ఏదో సీరియస్ విషయమే అయ్యుండాలి లేదా బాస్ లీవ్ పెట్టయినా ఉండాలి లేకపోతే వీళ్ళంత ధైర్యంగా మార్నింగ్ అవర్‌లో ముచ్చటపెట్టరు అనుకుని రిలాక్స్‌గా వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది.

పొద్దునపొద్దునే అంత సీరియస్‌గా చర్చించుకుంటున్నది దేని గురించో తెలుసుకోవాలని కుతూహలంగా ఉన్నా ఎలాగూ కాసేపటికైనా విషయం తనదాకా అదే వస్తుందిలే అనుకుని అలాగే కూర్చుండి పోయింది.

''ఈవిడ గారెప్పుడూ ఇంతే ఏదీ సీరియస్‌గా పట్టించుకోదు నిమ్మకు నీరెత్తినట్లుంటుంది అయినా ఈ విషయానికి ఎలా రియాక్ట్ అవుతుందో చూద్దాం రండి''అని గాయత్రి తన చుట్టూ ఉన్న గుంపుని వైష్ణవి వైపు మళ్ళించింది.

''వైష్ణవీ ఇది విన్నావా మన భార్గవికి ఏడో నెల అట. ఇంకా పెళ్ళి చేసుకోలేదు అయినా ఎంత ధైర్యంగా నవ్వుతూ తుళ్ళుతూ తిరుగుతోందో పది రోజులు బాగా లేదని సెలవు పెట్టింది కదా ఈరోజే వచ్చింది ఆఫీసుకి. మనిషిలో ఇంతకుముందుకంటే తేడా స్పష్టంగా కనిపిస్తోంది. ఏంటి విషయం అని అడిగితే సిగ్గుపడకుండా చెప్తోంది ఏడో నెల వచ్చింది ఆరోగ్యం బాగాలేక సెలవు పెట్టాను అని''. చాలా విస్మయంగా చెప్పుకొచ్చింది గాయత్రి.

''పెళ్ళి కాకుండా తల్లినవుతున్నాననన్న ఫీలింగ్ గానీ, జనాలు ఏమనుకుంటారో అన్న భయంగానీ ఏమీలేవా మెలో ఎంత నిమ్మళంగా ఉందో తెలుసా'' అంది సునీత ఇంకా ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ.

''అవునా''...అంది వైష్ణవి.

''అవునా అని అంత తాపీగా అంటున్నావేమిటీ నీకేమనిపించడం లేదా ఈ న్యూస్ వింటే... మాకైతే మతిపోతోంది''... అంది లక్ష్మి.

''ఇందులో అనిపించడానికేముంది. భార్గవి, సురేష్‌ల అఫైర్ మనకి తెలిసిందేగా. ఇద్దరూ ఇష్టపడి కలిసుంటున్నపుడు కడుపు రావడం సహజమే కదా ఆమెకి లేని ఆదుర్దా, కంగారు మీకెందుకంటా...''

''కంగారు కడుపు వచ్చినందుకు కాదు. పెళ్ళిచేసుకోకుండా ధైర్యంగా బిడ్డని కనడానికి సిద్ధపడినందుకు...''

''పిచ్చా మీకేమైనా ఆమె ఇష్టం ఆమెది. ఓ బిడ్డ కావాలనుకుందేమో పిల్లలంటే ఎవరికైనా ఇష్టమేనా పిల్లలకోసం చెట్లకి, పుట్లకి మొక్కేవాళ్ళెంత మంది లేరు మన సొసైటీలో...''

''మరి బిడ్డను కనాలనుకున్నపుడు ఇద్దరూ పెళ్ళిచేసుకోవచ్చు కదా...''

''ఏం పెళ్ళి చేసుకోకపోతే బిడ్డని కనకూడదని రూలేమైనా ఉందా. పెళ్ళి చేసుకుని పిల్లల్ని కన్నవాళ్ళ అవస్థలు మనం చూస్తూనే ఉన్నాంగా. తన మీద ఏ పురుష పెత్తనమూ లేకుండా స్వతంత్రంగా తనకు నచ్చిన విధంగా బతకాలనుకుంది భార్గవి. తనదంటూ ఓ బిడ్డ ఉంటే వృద్ధాప్యంలో తోడు ఉంటారనుకుంది. తన కోరిక సురేష్ ద్వారా నెరవేర్చుకోవాలనుకుంది.''

వైష్ణవి మాటలకి చురచురా చూశారంతా ఆమెవైపు.

''అంటే పెళ్ళి చేసుకోకుండా మగాళ్ళతో ఇష్టంవచ్చినట్లు తిరిగి కడుపు తెచ్చుకోడం తప్పుకాదంటావు'' సీరియస్‌గా అడిగింది సునీత.

''దాన్లో ఉన్న తప్పొప్పుల సంగతి ఎలా ఉన్నా పెళ్ళిచేసుకుని సంసారం చేస్తూ మొగుడు బైటకెళ్ళగానే పరాయి మగాళ్ళని పడక గదుల్లోకి ఆహ్వానించే గృహిణులకంటే తనకు నచ్చిన వ్యక్తితోనే సహ జీవనంచేస్తూ అతనితోనే బిడ్డను పొందాలనుకునే భార్గవి ఎంతో మేలని నా అభిప్రాయం.''

వైష్ణవి మాట్లాడుతుండగానే భార్గవి లోపలికి వచ్చింది. ఆమెని చూడగానే మూతి విరుచుకుంటూ ఎవరి సీట్లలోకి వాళ్ళు జారుకున్నారు. ''హాయ్... ఎలా ఉన్నావ్...''అడిగింది భార్గవి వైష్ణవిని చూసి నవ్వుతూ.

''నేను బాగానే ఉన్నాను గానీ నువ్వెలా ఉన్నావ్... చాలా రోజులు లీవ్ పెట్టావు ఏమిటి విషయం అడిగింది ఏమీ తెలియనట్లుగానే.''

మిగతా కొలీగ్స్‌కి చెప్పినంత తాపీగానే వైష్ణవికి కూడా తన కడుపు గురించి చెప్పింది భార్గవి.

''వీళ్ళంతా జీర్ణించుకోలేకపోతున్నారు వైష్ణవీ ఈ విషయాన్ని'' అందర్నీ ఉద్దేశించి చూస్తూ అంది భార్గవి.

''అవును మరి పెళ్ళంటే నూరేళ్ళ పంట అని వివాహ బంధం పవిత్ర బంధం అని నమ్మే మన సంస్కృతికి నీ విషయం మింగుడు పడడం కష్టమే. వాళ్ళు డైజస్ట్ చేసుకోడానికి ఇంకొంత కాలం పడుతుందిలే. పట్టించుకోకు. నీ ఆరోగ్యం జాగ్రత్త'' చెప్పింది వైష్ణవి చిరునవ్వుతో.

''థాంక్స్. వైష్ణవీ నువ్వొక్కదానివే నా ఆరోగ్యం గురించి చెప్పావు. థ్యాంక్యూ'' అంటూ వైష్ణవి చేతిని ఆప్యాయంగా స్పృశించి వెళ్ళిపోయింది భార్గవి.

ఓ వారంరోజులు గడిచాక ఒకరోజు సాయంత్రం నాలుగ్గంటలకి ఆఫీసులో పనిచేసే స్వీపర్ రేణుకని పిలిచింది వైష్ణవి.

''రాత్రి నీతోపాటు సినిమాకి వచ్చిందెవరు''... అడిగింది రేణుకని. అనుకోని ఆ ప్రశ్నకి ఉలిక్కిపడిందామె. తత్తరపాటును కప్పిపుచ్చుకుంటూ ఏం సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తూండగా మళ్ళీ అడిగింది వైష్ణవి.

''భయపడకు నిజం చెప్పు. నేనెవరికీ చెప్పనులే.''

వైష్ణవి మాటకి కాస్త ధైర్యం వచ్చిందామెకి.

''మా అమ్మ నాయన చిన్నప్పుడే పోయారండి. మా అక్క వాళ్ళు నా బరువు వదిలించుకోడానికి యాభయ్యేళ్ళు ముసలోడికిచ్చి కట్టబెట్టారండి. ఆ ముసలోనికి భార్యని సుఖపెట్టడమే తెలీదండి. పొద్దంతా పనిచేయడం తాగివచ్చి తొంగోడం తప్ప వేరే పనే ఉండదు. నా బాధ చూడలేక మా బావ నన్ను చేసుకుంటానంటున్నాడండి. మా ఆయనకి విడాకులు ఇచ్చి మా బావని పెళ్ళిచేసుకుందామనుకుంటున్నానండి.''

''మీ బావకి నీకు మధ్య ఎప్పటినుండి నడుస్తోంది వ్యవహారం...''

''నాలుగేళ్ళనుంచీ నడుస్తోంది మేడమ్.''

''అతనికి పెళ్ళయింది...'' ''కాలేదు...''

''మరి నిన్ను చేసుకుంటాడా. ఒకవేళ చేసుకున్నా వాళ్ళింట్లోవాళ్ళు మీ పెళ్ళికి ఒప్పుకుంటారా''... మాట్లాడలేదు రేణుక.

''చూడు... జీవితమంటే ఆటలుకాదు. నువ్వీరోజు సంసారాన్ని కూలదోసుకుని ఎవడ్నో నమ్ముకుని మొగుడ్నికాదని వెళ్ళిపోతే అతను నీకు జీవితకాలం తోడుగా ఉంటాడని గ్యారంటీ ఏముంది. ఏదో అవసరానికి వాడుకుని తనదారి నతను పోతాడు. అపుడు ఏ తోడూ లేక ఆదరించే దిక్కులేక బజారుపాలవుతావు. ఆలోచించుకో... విడాకులు, మళ్ళీ పెళ్ళి అన్నవి అంత సులువైన విషయాలు కావు. బుద్ధిని వక్రమార్గంలోంచి మళ్ళించి సరిగా వాస్తవాలను, భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని ఆలోచించు'' వైష్ణవి మాటలకి వివర్ణవదనంతో కదిలింది అక్కడినుండి రేణుక.

పని చేసుకుంటూనే సంభాషణంతా విన్న గాయత్రి రేణుక వెళ్ళగానే వైష్ణవి దగ్గరకొచ్చి కూర్చుంది.

''నువ్వు చాలా కరెక్ట్‌గా ఆలోచించే మనస్తత్వం ఉన్నదానివి అనుకున్నానిప్పటివరకూ. ఒక్కొక్కరి విషయంలో ఒక్కో న్యాయం చెప్తావనుకోలేదు.''

''అంటే...'' గాయత్రి మాటలకి అర్థంబోధపడలేదు వైష్ణవికి.

''అవును మరి. భార్గవి పెళ్ళి చేసుకోకుండా కడుపు తెచ్చుకుంటే అది ఆమె ఇష్టం. తన ఇష్టం వచ్చినట్లు జీవించే హక్కు తనకి ఉంది అన్నావు. మరి అదే న్యాయం రేణుకకి కూడా వర్తించాలి కదా. తన ఇష్టం వచ్చినవాడితో తిరిగే హక్కు ఆమెకి ఉంది. వాళ్ళ అక్కవాళ్ళు బలవంతాన ఓ ముసలోడికి ఇచ్చి కట్టబెడితే జీవితాంతం ఇష్టంలేని మొగుడితో కాపురం చేయడంకంటే తనకిష్టమైన వాడిని పెళ్ళిచేసుకోవాలనుకుంటే తప్పేంటి.''

''ఆ...బావుంది ఇంకా ఇంకేం చెప్తావో చెప్పు'' అంది వైష్ణవి నవ్వుతూ.

''ఏంటీ నా మాటలు నీకు నవ్వులాటగా అనిపిస్తున్నాయా లేక సమాధానం చెప్పలేక ఇలా అంటున్నావా'' సీరియస్‌గా అడిగింది గాయత్రి. గాయత్రి వ్యంగ్యానికి నొచ్చుకోలేదు వైష్ణవి. పైగా నవ్వుతూ అంది.

''భార్గవి చేస్తున్నదానికీ, రేణుక చేస్తున్న పనికీ చాలా తేడా ఉంది గాయత్రీ. భార్గవికి తన జీవితాన్ని గురించి, భవిష్యత్తు గురించి ఖచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఆమె తను ఇష్టపడిన సురేష్ మినహా మరే మగాడికీ చనువివ్వలేదు. తాను ఒంటరిగా, స్వతంత్రంగా బ్రతకాలనుంది. వృద్ధాప్యంలో ఆసరాగా ఉండేందుకు ఓ బిడ్డ ఉంటే మంచిదనుకుంది. అదీ తన రక్తం పంచుకు పుట్టిన బిడ్డ కావాలనుకుంది. ఆ బిడ్డని సురేష్ ద్వారా పొందాలనుకుంది. తను అనుకున్నది నెరవేర్చుకోడానికి ఎలాంటి పరిస్థితులెదురైనా భరించడానికి ముందే మానసికంగా ప్రిపేర్ అయింది. కానీ రేణుక విషయం అలా కాదు కదా. ఆమె భర్త పట్ల ఆమెకున్న అయిష్టాన్ని, విముఖతని అవకాశంగా తీసుకుని వాడుకోవాలనుకుంటున్న ఒక అవకాశవాది మోసానికి బలవుతోందామె. ఆమె పిచ్చిగాని ఒకసారి పెళ్ళయిన ఆడదాన్ని మళ్ళీ పెళ్ళిచేసుకుని జీవితాంతం తోడుగా ఏ పెళ్ళికాని మగాడు ఉంటాడు చెప్పు. ఆమె దృష్టినుంచి చూస్తే జాలేస్తుంది ఆమె స్థితికి. అలాగని ఆమె చేస్తున్న పనిని సమర్థించలేం కదా.''

''ఆమె రెండు తప్పులు చేస్తోంది. ఒకటి భర్తని మోసం



ఎప్పుడూ చిరునవ్వుతో చలాకీగా ఉండే మిమ్మల్ని చూస్తే చాలా ఆనందంగా ఆశ్చర్యంగా అనిపిస్తుంటుంది. నీకు నా గురించి పూర్తిగా తెలుసు. జీవితంలో ఏ దశలోనూ ప్రేమాభిమానాలు లేక ఆప్యాయతకోసం అలమటించిపోయాను. ఎంతోమంది ఆడవాళ్ళు నా స్టేటస్ చూసి నాతో ఉండడానికి ఇష్టపడ్డారు కానీ నేనే ఎవరినీ ఇష్టపడలేకపోయాను.

చేస్తోంది. బలవంతంగా ఇష్టంలేని పెళ్ళిచేసిన పాపం ఆమె అక్కావాళ్ళది కానీ అతని తప్పేంలేదు కదా. పోనీ అతనేమైనా హింసిస్తున్నాడు అంటే వదిలేయొచ్చు. రెండోది ఒక మోసగాడ్ని నమ్మి తన సంసారాన్ని నాశనం చేసుకుంటోంది. ఆమెకి తనుచేస్తున్న పొరపాటుకి ఫలితాన్ని ఇప్పటికిప్పుడు కాకపోయినా ముమ్ముందు అనుభవించాల్సి వస్తుంది. పాపం అంత పరిస్థితి ఆమెకి ఎందుకు రావాలి అని ఈ సలహా ఇచ్చానంతే. ఆమె ఎలా రిసీవ్ చేసుకుంటుందో ఆమె ఇష్టం. నేను చెప్పాలనుకున్నది చెప్పానంతే...''

దీర్ఘాలోచనలో పడింది గాయత్రి వైష్ణవి మాటలకి.

''హలో మేడమ్. సమాధానం చెప్పలేక దాటవేస్తున్నావా అని నన్నడిగావ్ ఇంతకీ నా సమాధానం విన్నావా లేక నీ ఊహల్లో నువు విహరిస్తున్నావా.''

''విన్నానేవోయ్. నాకో పెద్ద సందేహం వైష్ణవీ. భార్గవి ఇపుడు ధైర్యంగా బిడ్డని కనడానికి సిద్ధపడింది. కానీ రేపు పెద్దయ్యాక నా తండ్రి ఎవరు అంటే ఏం చెప్తుంది. అప్పటికి సురేష్ పెళ్ళిచేసుకోకుండా భార్గవితోనే ఉంటాడని గ్యారంటీ ఏముంది. అతను వెళ్ళిపోతే తన బిడ్డకి తండ్రి ఎవరని చెప్తుంది. ఆ బిడ్డ పెద్దయ్యాక ఆమె అభిప్రాయాలని మంచిగా అర్థం చేసుకుంటుందా?''

''ఈ ప్రశ్నలన్నిటికీ కాలమే సమాధానం చెప్తుంది తల్లీ. అప్పటి జనరేషన్ ఎలా ఉంటుందో ఎవరికెరుక. మనం మన తల్లిదండ్రుల ఎదురుగా ఎన్నడైనా గట్టిగా మాట్లాడామా? ఈ కాలం పిల్లలు అడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పగలుగుతున్నారా తల్లిదండ్రులు. రేపటి తరం ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు''. వైష్ణవి మాట్లాడుతుండగానే ప్యూన్ వచ్చాడక్కడికి.

''సార్ మిమ్మల్ని రమ్మంటున్నారు మేడమ్.''

''ఏం సలహా కావాలో ఏమో గురువుగారికి దయచేయండి'' అంటూ వెళ్ళిపోయింది గాయత్రి. కాస్త న్యాయశాస్త్ర పరిజ్ఞానం ఉండడాన్ని ఆఫీసులో ఎవరికే సమస్య వచ్చినా వైష్ణవినే సలహా అడుగుతారు బాస్‌తో సహా. ఆయన మరీ ఆయనకున్న పర్సనల్ సమస్యలతో సహా చెప్పుకుంటాడు. మొదట్లో మొహమాటానికి పోయి ఓపిగ్గా విన్నా రానురాను విసుగేసి అతను మాట్లాడాలనుకున్నపుడల్లా బిజీగా ఉన్నానని, వర్క్ పెండింగ్ ఉందని సున్నితంగా చెప్పి తప్పించుకోవడం మొదలుపెట్టింది.

అఫీషియల్, పర్సనల్ అసలే టైమయిపోతోంది అనుకుంటూ బాస్ రూమ్‌లోకి అడుగుపెట్టింది.

''రండి...కూర్చోండి... చాలా రోజులయింది మీతో మాట్లాడి''... చిరునవ్వుతో సాదరంగా ఆహ్వానించాడు.

అయిపోయాను బలే ఈరోజు ఎలాగైనా కట్ చేసి వెళ్ళిపోవాలి అనుకుంటూ చిరునవ్వును బలవంతాన తెచ్చిపెట్టుకుంది పెదవుల మీదికి.

''మిమ్మల్ని చాలారోజుల్నుండి ఒక మాట అడగాలనుకుంటున్నాను వైష్ణవీ ధైర్యం చాలక ఊరుకున్నాను. కానీ ఈరోజు ఎలాగైనా అడగాలనుకుంటున్నా. నిన్ను చూస్తే ఎంతో అడ్మిరేషన్ నాకు. ఎపుడూ చిరునవ్వుతో చలాకీగా ఉండే మిమ్మల్ని చూస్తే చాలా ఆనందంగా ఆశ్చర్యంగా అనిపిస్తుంటుంది. నీకు నా గురించి పూర్తిగా తెలుసు. జీవితంలో ఏ దశలోనూ ప్రేమాభిమానాలు లేక ఆప్యాయతకోసం అలమటించిపోయాను. ఎంతోమంది ఆడవాళ్ళు నా స్టేటస్ చూసి నాతో ఉండడానికి ఇష్టపడ్డారు కానీ నేనే ఎవరినీ ఇష్టపడలేకపోయాను. కానీ నిన్ను చూశాక నాలో ఏదో చెప్పలేని అనుభూతి, అభిమానం. నీ అందం ముఖ్యంగా నీ వ్యక్తిత్వం నాకెంతో నచ్చాయి అందుకే నీ ప్రేమకోసం అర్థిస్తున్నాను''... గబగబా చెప్పుకుపోతున్న అతని మాటలకి అవాక్కయింది వైష్ణవి.

''సారీ మీరు రాంగ్ పర్సన్‌ని ఎంచుకున్నారు. నాకు పెళ్ళయి పిల్లలున్నారని తెలిసీ మీరిలా మాట్లాడ్డం బావ్యం కాదు.''

''నాకు తెలుసు వైష్ణవీ... కానీ నీ అంత మంచి వ్యక్తిత్వం గలవాళ్ళు నాకు దొరుకుతారన్న నమ్మకం లేదు.''

''అవునా...ఇంతకీ నాలో ఏంచూసి ఇష్టపడుతున్నానన్నారు''... సీరియస్‌గా అడిగింది వైష్ణవి.

''నీ వ్యక్తిత్వం చూసి...''

''మరి... మీ కోరికని మన్నిస్తే నాలో ఉన్నత వ్యక్తిత్వం ఉన్నట్లేనంటారా... మాట్లాడలేకపోయాడతను. నోరు తెరుచుకుని అలాగే చూస్తూండిపోయాడామె వైపు.

''చూడండీ... మనం ఏం చేస్తామో అదే ఎదుటివారికి చెప్పాలి. ఎదుటి వాళ్ళకి ఏం చెప్తామో అదే మనమూ పాటించాలి. చేసేదొకటి, చెప్పేదొకటి అయితే తాత్కాలికంగా పనిచేసినా ఫలితంమాత్రం మన చెప్పుతో మనమే కొట్టుకున్నట్లవుతుంది. సారీ... మరెప్పుడూ ఇలాంటి ప్రస్తావనలు తేకండి. ఆడవాళ్ళని లొంగదీసుకునేందుకు ఇలాంటి అతి తెలివితేటల్నీ ఉపయోగిస్తారన్న సంగతి గ్రహించలేనంత మూర్ఖురాలిని కాదు''అని సీరియస్‌గా అక్కడినుండి వెళ్ళిపోయింది.

గబగబా బ్యాగ్ తీసుకుని తనకోసమే ఎదురుచూస్తున్న గాయత్రితో బస్‌స్టాప్‌కి కదిలింది వైష్ణవి. బాస్‌తో జరిగిన సంభాషణంతా చెప్పి చివరగా అంది. 'ఈరోజు ఓ పెద్ద గుణపాఠం నేర్చుకున్నాను గాయత్రీ. ఇంకెపుడూ ఎవరి బాధలూ గాథలూ వినకూడదని. ముఖ్యంగా మగవాళ్ళు చెప్పే కల్లబొల్లికబుర్లు అసలే వినకూడదని'' స్థిర చిత్తంతో చెప్తున్న వైష్ణవి వైపు ఆత్మవిశ్వాసపు నిలువెత్తు రూపాన్ని చూస్తున్నంతగా ఫీలయింది గాయత్రి. ★